

చేనేత కార్మికులపై దౌర్జన్యం

కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతల ఆగడాలు శృతిమించిపోతున్నాయి. బలహీనవర్గాలకు చెందిన భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. -8లో



చరిత్ర మరిచిన యోధుడు ఉయ్యాలవాడ

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటుకు సంబంధించి బ్రిటీష రికార్డులు ఎన్నో ఉన్నాయి. కానీ ఆయన సాగించిన తిరుగుబాటు చరిత్రపుటల్లో చోటు చేసుకోలేదు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 78 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 6వ తరగతిలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆయా మండలాల్లోని మోడల్ స్కూళ్లలో ఒక సెట్ దరఖాస్తును అందజేయాలన్నారు. ప్రవేశ పరీక్ష ఆయా మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లోనే ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఉంటుందన్నారు. పరీక్ష రుసుం 24.02.2025 నుంచి 31.03.2025 మధ్య చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ ఆలయంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ. 4,29, 680 వచ్చినట్లు ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ నగదును ఆలయ ఖాతాకు జమచేస్తామని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పూజారులు చెల్లు గంగరాజు, దినేష్ కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో టమాటా విక్రయాలకు అనుమతి

కడప అగ్రికల్చర్: వైఎస్‌ఆర్ జిల్లాలో టమాటా రైతులకు పంట ఉండి ఎటువంటి గుర్తింపు కార్డు లేకపోయినా రైతు బజార్‌లో సరుకులు అమ్మకాలు చేయడానికి ప్రభుత్వం అనుమతి కల్పించిందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ వారు రైతులు తమ సరుకును నేరుగా తీసుకుని తమ పరిధిలోని రైతు బజార్లలో అమ్ముకునేందుకు అవకాశం కల్పించినట్లు జేసీ పేర్కొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి



విశిష్ట సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రాజంపేట రూరల్: ప్రభుత్వ పథకాలు పొందాలంటే జిల్లాలోని రైతులందరూ తప్పనిసరిగా విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ కోరారు. మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. నమోదు ఏ విధంగా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. రైతులకు విశిష్ట సంఖ్య నంబర్ నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జీ.రాజకుమారీ, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఎంత కష్టం.. ఎంత నష్టం!

- రైతును నట్టేట ముంచిన వంగసాగు!
- కాయలు కోతకు వచ్చే వరకు ఎకరా సాగుకు రూ. 1.25 లక్షలు
- మార్కెట్‌లో పడిపోయిన ధరలు
- తోటల్లోనే వదిలేస్తున్న రైతులు





చెరువుమొరవపల్లెలో కాయలు కోకుండా తోటల్లోనే వదిలేసిన రైతులు

గుర్రంకొండ: జిల్లాలో వంగసాగు రైతులను నట్టేట ముంచింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వంగ ధరలు రూ. 8 నుంచి రూ.10 వరకు ధరలు పలుకుతున్నాయి. కోతకూలీలు, రవాణా ఖర్చులు కూడా మిగలకపోవడంతో రైతులు కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తమిళనాడుకు వెళుతున్న వంగను ధరలు లేక పోవడంతో అక్కడి వ్యాపారులు కొనుగోలుకు మొగ్గుచూపడం లేదు. దీంతో జిల్లాలో 1865 ఎకరాల్లో వంగ సాగు చేసిన రైతులకు రూ.23.31 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది.

జిల్లాలో 1865ఎకరాల్లో వంగసాగు:
జిల్లాలో ఈసీజన్‌లో 1865 ఎకరాల్లో వంగ తోటల సాగు చేపట్టారు. ఎకరం సాగుకు దుక్కుల దగ్గర నుంచి కాయలు కోతకు వచ్చేంత వరకు రూ. లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకు ఖర్చు వస్తుంది. చెట్టు ఎదుగుదలకు, పూతపిందె నిలవడానికిగానూ వారానికి ఒక సారి మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. చెట్టుకు సత్తువ ఇచ్చి కాయలు ఎక్కువ కాయడానికి పురుగుల మందు కోసం ప్రతి వారం సుమారు రూ. 6 వేలు నుంచి రూ.8 వేలవరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన 90 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు మూడు నెలల పాటు కాయల కోత ఉంటుంది.



రూ.23.31 కోట్ల మేరకు నష్టం:

ఈ సీజన్‌లో జిల్లాలో వంగ పంట సాగు చేసిన రైతులు రూ. 23.31 కోట్ల మేరకు నష్టపోయారు. ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వంగ రూ. 8 నుంచి రూ.10 వరకు ధరలు పలుకుతున్నాయి. కిలో వంగ తమిళనాడు మార్కెట్‌కు చేరేవరకు కోతకూలీలు, రవాణాఖర్చులు, మార్కెట్లో కమీషన్లు కలుపుకొంటే రూ. 12 వరకు ఖర్చు వస్తుంది. అంటే రైతు కిలో వంకాయలు మార్కెట్ చేరవేయడానికి అదనంగా చేతి నుంచి రూ. 2 నుంచి రూ. 4 వరకు ఖర్చు చేయాల్సి ఉంది. దీంతో ఇప్పటివరకు ఎకరానికి సాగుకు చేసిన పంట ఖర్చు రూ.1.25లక్షలు పూర్తిగా నష్టపోయారు. నెలరోజులుగా వంగ ధరలు పతనమవడంతో నష్టాలు భరించలేక కాయల్ని కోయకుండా తోటల్లోనె వదిలేస్తున్నారు. తమిళనాడులో అక్కడ లోకల్‌గా కాయలు మార్కెట్లకు వస్తుండడంతో ఇక్కడి వంగకు డిమాండ్ తగ్గిపోయింది. దీంతో రోజు రోజుకు ధరలు పడిపోయాయి. నెల రోజుల క్రితం వరకు మార్కెట్లో కిలో వంగ రూ.20 నుంచి రూ. 30 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం ధరలు ఒక్కసారిగా పతనమవడంతో రైతులు నష్టపోతున్నారు. పలుచోట్ల వంగతోటలు పశుగ్రాసంగా మారిపోయాయి. రాబోయే రోజుల్లో ధరలు పుంజుకొంటాయన్న ఆశతో పంటను కాపాడుకొనేందుకు కొంతమంది రైతులు చర్యలు చేపడుతున్నారు. చాలామంది మాత్రం వంగ పంటపై ఆశలు వదులుకోవడం గమనార్హం

రైతన్నకు దెబ్బమీద దెబ్బ..

ఇప్పటికే ఓవైపు టమాటా, మరోవైపు పూల తోటల సాగుతో భారీగా రైతులు నష్టపోయారు. కనీసం వంగపంట అయినా తమకు గట్టెక్కిస్తుందన్న నమ్మకం ఉంచిన రైతులకు అది కాస్తా నట్టేట ముంచింది. నెలరోజుల ముందు వరకు ఆశించిన మేరకు వంగ ధరలు ఉన్నాయి. అయితే రోజురోజుకు తమిళనాడు, కార్ణాటక రాష్ట్రాల్లో వంగ ధరలు పూర్తిగా పతనమవడంతో ఆప్రభావం జిల్లా రైతులపై పడింది. మన జిల్లా నుంచి 90 శాతం వంగ పంట తమిళనాడు, కర్ణాటక రాష్ట్రానికి ఎగుమతి చేస్తుంటారు.

కోయకుండా తోటల్లోనే వదిలేశాం



తమిళనాడులో వంగధరలు పూర్తిగా పడిపోయాయి. అక్కడ కిలో రూ. 8 వరకు ధరలు పలుకుతున్నాయి. ఒక కిలో వంగ తమిళనాడు మార్కెట్‌కు చేరాలంటే రూ.11 నుంచి రూ.12 వరకు ఖర్చు వస్తుంది. కాయలు మార్కెట్‌కు తీసుకెళితే చేతి నుంచి డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. చేసేదిలేక కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేశాము.

– రెడ్డిమోహన్, రైతు, చెరువుమొరవపల్లి

రెండు ఎకరాలో సాగు చేశా



రెండు ఎకరాల పొలంలో ఉజాల రకం వంగ సాగు చేశాను. టమాటాతో నష్టపోయిన రైతులకు వంగ సాగుతో కొంత ఊరట నిస్తుందనుకొంటే ఇది కూడా నట్టేట ముంచింది. మార్కెట్లో కొద్ది రోజులుగా ధరలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. ఇవే ధరలు నిలకడగా ఉంటే రూ. 3 లక్షలు నష్టపోవాల్సి ఉంటుంది.

– రమణమ్మ, మొరంమీద పల్లె

24న గండిలో టెండర్లు

చక్రాయపేట: జిల్లాలోని గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఈనెల 24న తలనీలాలు,ఒక భాగం కొబ్బరి చిప్పలు సేకరించే హక్కు కల్పించడానికి ఇ-టెండర్, షీల్డ్ టెండర్, బహిరంగ వేలంపాటను 3వ పర్యాయం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. గతం లో రెండు మార్లు టెండర్లు నిర్వహించినా సరైన ధర రానందున టెండర్లు రద్దు చేశామన్నారు. సోమవారం జరిగే టెండర్లలో పాల్గొనే వారు తలనీలాలకు రు.25లక్షలు,కొబ్బరి చిప్పలకు రు.3లక్షలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మార్చి 6న 'చలో విజయవాడ'

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మున్సిపల్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మార్చి 6న తల పెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కెసీ బాదుల్లా పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుపరిస్తే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మళ్లీ ప్రైవేటు బడా కంపెనీలకు,ఏజెన్సీలకు అప్పచెబుదామన్న మంత్రివర్గ సభ్యుల అభిప్రాయాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జరగనున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికి పోరాటానికి కార్మికుల సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పర్మినెంట్ కార్మికులకు మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్ లో ఎన్‌క్యాస్‌మెంట్, మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలన్నారు. ఈ నెల 24న కడప నగరపాలక సంస్థ కార్యాలయం, మార్చి 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన, ధర్నాలు చేపడతామన్నారు.మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వరయ్య, జాన్, వెంకటాద్రి, రాజశేఖర్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



చిన్నమండెం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్

చిన్నమండెం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక , రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన వాటికి పరిష్కార మార్గాలు చూపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిన్నమండెం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల గురించి రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. వీలైనంత త్వరగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరిం చాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో వెనుకబడిన గ్రామాల వీఆర్‌ఓలను కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చొరవ చూపకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్‌నాయక్, ఆర్ఐ శిల్ప, మండల సర్వేయర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి

రాయచోటి: రాయచోటి పట్టణం బైపాస్ రోడ్డు సమీపంలోని వాగు ఆక్రమిత ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇక్కడి ప్రభుత్వ భూములను కలెక్టర్ పరిశీలించారు. రాయచోటి గ్రామ పొలం సర్వే నంబరు. 592 వాగు భూమిగా స్వభావం కలిగి ఉందన్నారు. ఈ నంబబర్ నుంచి సర్వే నంబర్ 996/2బిలో 1.62 ఎకరాలు.. సర్వే నంబర్ 997 8.34లో ఎకరాలు, సర్వే నంబర్ 1003 లో 3.93 ఎకరాలు విభజన జరిగిందని తహసీల్దార్ నరసింహ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ భూములపై దరఖాస్తు పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో లేవన్నారు. అయినప్పటికీ క్రయ విక్రయాలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఇందుకు సంబంధించిన భూమి రికార్డులను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఇవి ప్రభుత్వ భూములుగా భావిస్తూ ప్రభుత్వ భూములపై క్రయ విక్రయాలు జరగకూడదు. కాబట్టి వెంటనే ఈ భూములను తిరిగి స్వాధీన పరుచుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేరస్తుల ఛేదనలో ఆరితేరిన జాగిలం

- 11 ఏళ్లు విధులు.. జాగిలం మ్యాగి పదవీ విరమణ
- సన్మానించిన ఎస్పీ, పోలీసులు



పదవీ విరమణ పొందిన జాగిలం మ్యాగిని సన్మానిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: ఉద్యోగి 60, 62 సంవత్సరాల తరువాత పదవీ విరమణ పొందడం సహజమని పోలీస్ శాఖలో దొంగలు, నేరస్తులు, బాంబులు, ప్రమాదకరమైన వస్తువులను పసిగట్టి పట్టించడంలో దిట్టుగా పేరొందిన జాగిలాలకు కూడా తొమ్మిది సంవత్సరాల సర్వీసు తరువాత పదవీ విరమణ అవుతుందని పోలీసులు చెబుతున్నారు. ఈ కోవలోనే మ్యాగి అనే పోలీసు జాగిలం సర్వీసు అనంతరం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పదవీ విరమణ పొందింది. మ్యాగి 11 సంవత్సరాలు పాటు విశిష్ట సేవలందించి పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వహించడం పట్ల జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు అభినందించారు. పోలీస్ కార్యాలయంలోని వేదిక దగ్గర మ్యాగి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హత్యలు, రేప్‌లు, దొంగతనం చేసిన వారిని గుర్తించడంలో నేర్పరిగా పేరున్న జర్మన్ షపర్డ్ జాతికి చెందిన జాగిలం మ్యాగిని జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ సందర్భంలో కూడా సంపూర్ణ ఆరోగ్యంతో చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హాండ్లర్ బి మణిగుండన్‌ను(ఏఆర్‌హెచ్‌సీ 849) జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు కూడా మ్యాగిని జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు.

మ్యాగి ఉద్యోగ సేవలు ఇలా.....
జర్మన్ షపర్డ్ జాతికి చెందిన ఈ జాగిలం పుట్టిన తేది 23.10.2013. దీని వయస్సు 11 సంవత్సరాలు,. ఈ జాగిలం ఉద్యోగ సర్వీస్ 9 సంవత్సరాలు అయినప్పటికీ, రెండు సంవత్సరాలు అదనంగా విధులు నిర్వర్తించింది. 2014లో మెయినాబాద్, హైదరాబాద్‌లో ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో ట్రాకర్ విభాగంలో 8 నెలలు శిక్షణ పొందింది. ఆరు సంవత్సరాలు చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తించింది. 2022లో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో అన్నమయ్య జిల్లాకు బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తోంది. 2015లో చిత్తూరు జిల్లా, పెనుమూరు మండలం, దిగువపూనేపల్లి గ్రామంలో రేప్, మర్డర్ కేసును ఛేదించింది. కేసు ఛేదనతో అప్పటి అనంతపురం రేంజ్ డీఐజీ చేతుల మీదుగా రూ. 250లు క్యాష్ రివార్డు తీసుకుంది. జాగిలం రాష్ట్రస్థాయిలో రెండుసార్లు సెలక్ట్ అయింది. మన రాష్ట్రం తరపున ట్రాకర్ విభాగంలో 2016లో మైసూర్, 2017లో చెన్నైలో నిర్వహించిన ఆల్‌ఇండియా పోలీస్ డ్యూటీమీట్‌లో పాల్గొంది. చిత్తూరు జిల్లాలోని తవనంపల్లిలో హత్య కేసును క్షణాల్లో ఛేదించి నిందితుడిని పట్టించింది. అప్పటి చిత్తూరు జిల్లా ఎస్పీ మ్యాగీని మెడల్‌తో సన్మానించి జిల్లా పోలీస్ కార్యాలయం చుట్టూ బ్యాండ్ మేళాలతో ఊరేగించారు. 2016లో గణతంత్ర దినోత్సవం డాగ్ షోలో భాగంగా మ్యాగి పనితనాన్ని మెచ్చుకొని అప్పటి చిత్తూరు జిల్లా కలెక్టర్ రూ. 1 లక్షలు చెక్కును అందించారు. ఈ నగదును చిత్తూరు జిల్లా డాగ్ కెనాల్ పునరుద్దరణకు ఉపయోగించారు. అన్నమయ్య జిల్లా, ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నఓరంపాడు గ్రామంలో జరిగిన హత్య కేసును క్షణాల్లో ఛేదించి పోలీస్ ఉన్నతాధికారుల ప్రశంసలను అందుకుంది. అన్నమయ్య జిల్లాకు బదిలీపై వచ్చాక గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా డాగ్ షో చేస్తూ పిల్లల కేరితల మధ్య చూపరులను ఆకట్టుకుంటూ మ్యాగి అధికారుల మన్ననలు పొందింది. మ్యాగి పదవీ విరమణ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, ఏఓ బి కృష్ణుడు, ఆర్ఐలు విజె రామకృష్ణ, టి జాన్ జోషఫ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి రాజారమేష్, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మాటలు.. నీటిమూటలు

- టమాటా రైతులను ఆదుకోని మద్దతు ధర
- కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేసిన మార్కెటింగ్‌శాఖ
- ఎకరాకు రూ.లక్ష నష్టపోతామంటున్న రైతులు





మండీ యజమానులు, వ్యాపారులతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె: టమాటా ధరలు పతనమైన పరిస్థితిలో రైతులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న టమాటా కొనుగోళ్లు కంటితుడుపులా మారాయి. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి, నాలుగురూపాయలు సంపాదించుకుందామని ఆశగా ఎదురు చూస్తున్న రైతుకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో కుదేలైపోతున్నాడు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగుదశ నుంచి మార్కెటింగ్ దశ వరకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్న కూటమిప్రభుత్వం మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ప్రభుత్వం కొనుగోలు చేసిన కనీస మద్దతు ధర...కూలి ఖర్చులకు సరిపోకపోవడంతో గంపెడాశతో గంపలకొద్దీ టమాటాలను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతన్న నిరాశతో, నిట్టూర్పులు విడుస్తూ ఇంటికి వెళుతున్నాడు.

- రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మదనపల్లె టమాటా మార్కెట్‌లో సెక్రటరీ అభిలాష్ కిలో రూ.8 చొప్పున 10 టన్నుల టమాటాను కొనుగోలుచేశారు. వీటిని అధికారుల ఆదేశాల ప్రకారం నెల్లూరు రైతు బజారుకు తరలించి వినియోగదారులకు విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు... మార్కెట్ కమిటీ కార్యాలయానికి చేరుకుని మండీ యజమానులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. టమాటా ధరలు పతనమైన నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు సహకరించాల్సిందిగా వినతిచేశారు. స్థానికంగా పంట దిగుబడులు తక్కువగా వస్తున్న నేపథ్యంలో వస్తున్న సరుకును మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయడమా...? లేక రైతులకు మార్కెట్‌లో పలుకుతున్న ధర పోనూ, కొంతమేర అదనంగా సబ్సిడీ ఇవ్వడంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి వారి నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అయితే..ప్రభుత్వం కొనుగోలుచేసిన కనీస ధర రూ.8పై రైతులు పెదవివిరిచారు. ఎకరాకు రూ.2లక్షల వరకు పెట్టుబడి ఖర్చులు వస్తున్న నేపథ్యంలో కిలో టమాటా రూ.8 చొప్పున అమ్మడైతే, తమకు పెట్టుబడులు దక్కని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. టమాటా ధరల పతనంపై మార్కెట్ కమిటీ సెక్రటరీ అభిలాష్ మాట్లాడుతూ..టమాటాలు ఎగుమతి జరిగే అన్ని ప్రాంతాల్లోనూ స్థానికంగా టమాటా పంట ఉత్పత్తులు విరివిగా వస్తుండటంతో ధరలు తగ్గాయన్నారు. ప్రస్తుతం మదనపల్లె మార్కెట్‌లో అన్‌సీజన్ నడుస్తుండటంతో వ్యాపారులు చత్తీస్‌గఢ్, రాయపూర్, జబల్‌పూర్, మధ్యప్రదేశ్ నుంచి 30కిలోల టమాటా బాక్స్ రూ.70 చొప్పున కొనుగోలుచేసి, ఇక్కడకు తీసుకువచ్చి మార్కెట్ వెలుపల గ్రేడింగ్ చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. స్థానికంగా రోజుకు 50–60 మెట్రిక్‌టన్నుల దిగుబడి మాత్రమే వస్తోందన్నారు. ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన టమాటా పంట నేడు అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా సాగుచేస్తుండటం ధరల పతనానికి ప్రధాన కారణంగా పేర్కొనవచ్చన్నారు.

మహాశివరాత్రికి 317 ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని కడప రీజియన్ వ్యాప్తంగా వివిధ శైవ క్షేత్రాలకు 317 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్ఎం కార్యాలయంలో డిప్యూటీ సీఎంఈ, డిపో మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లతో మహాశివరాత్రి ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లు గురించి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ పొలతలకు 78 బస్సులు, నిత్యపూజకోన 40, శ్రీశైలం 2, రాయచోటి నుంచి పొలతలకు 40, పులివెందుల నుంచి పొలతలకు 27, భానుకోటకు 3, బద్వేలు నుంచి లంకమలకు 25, బి.మఠానికి 5, మల్లెంకొండకు 12, పోరుమామిళ్ల నుంచి ఎస్ఎస్ మఠానికి 3, మైదుకూరు నుంచి లంకమలకు 15, జ్యోతి (సావిశెట్టిపల్లె)కి 2, పోరుమామిళ్ల జ్యోతికి 6, బి.మఠానికి 15, ప్రొద్దుటూరు నుంచి పొలతలకు 15, ఎర్రగుంట్ల సంగమేశ్వర దేవళాలు 4, అల్లాడుపల్లె దేవళాలు 10, కన్యతీర్థం 6, జమ్మలమడుగు నుంచి అగస్త్యేశ్వరకోనకు 5, కన్యతీర్థంకు 2, శ్రీశైలానికి 2 బస్సులు చొప్పున మొత్తం 317 బస్సులను నడపనున్నామన్నారు. చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గంగమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు
మార్చి 1న లక్కిరెడ్డిపల్లె మండలంలోని గంగమ్మ జాతరకు కడప నుంచి 25 బస్సులు, పులివెందుల నుంచి 25 బస్సులు నడుపుతున్నామన్నారు. అలాగే మార్చి 14న పౌర్ణమి నాడు తిరువన్నామలై అరణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, మైదుకూరు డిపోల నుంచి బస్సులు బయలుదేరుతాయని ఆర్ఎం తెలిపారు.

ప్రతి సోమవారం నిత్యపూజకోనకు రెగ్యులర్ సర్వీసు

కడప కోటిరెడ్డిసర్కిల్: కిలోమీటరుకు రూ.1.88 ప్రకారంగా నిత్యపూజకోనకు రూ. 90 టిక్కెట్ ధరగా నిర్ణయించామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం కడప డిపోనుంచి నిత్యపూజకోనకు రెగ్యులర్ సర్వీసులు నడపనున్నామన్నారు. ఇప్పటికే దేవదాయశాఖ అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ మహాశివరాత్రికి స్పెషల్ బస్సుల్లో ఎటువంటి ఆర్టీసీ పాసులు, ఆధార్ కార్డు డిస్కౌంట్లు చెల్లుబాటు కావన్నారు. మహా శివరాత్రి సందరగా కడప-నిత్యపూజకోనకు రెండు స్టేజీలను ఏర్పాటు చేశామన్నారు. భాకరాపేట, సిద్దవటంలలో స్టాపింగ్ ఉంటుందన్నారు. భాకరాపేట నుంచి నిత్యపూజకోనకురూ. 60, సిద్దవటం నుంచి రూ.40ఛార్జి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కన్యాకుమారి, సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డి పల్లె పంచాయతీలో పేకాట స్థావరంపై గురువారం అర్ధరాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు కొండావాండ్లపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం సేకరించి దాడులు చేసి 9 మంది జూదరులను అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి రూ. 2 లక్షల 12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక ఆత్మహత్య



మృతి చెందిన రేవతి

రాజంపేట : పట్టణంలోని రామ్‌నగర్‌లో ఎం. రేవతి (18) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియడం లేదు. చికిత్స నిమిత్తం రాజంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువస్తే అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు.

హత్యరాలలో వ్యక్తి..



ఉరివేసుకొన్న హరిప్రసాద్

రాజంపేట : మండలంలోని హత్యరాల ఇసుక క్వారీ సమీపంలో సిగమాల హరిప్రసాద్(31) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు మన్నూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పుల్లంపేట మండలం రామక్కపల్లె గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. మతిస్థిమితం లేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు వివరించారు. కొద్ది రోజుల కిందట మృతుని తండ్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని రాజంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సెల్‌ఫోన్ పేలి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : సెల్‌ఫోన్ పేలి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన సురేష్ కుమార్(45) జీవనోపాధి కూలీ పనులు చేసుకునేందుకు పిటిఎంకు వచ్చాడు. స్థానికంగా హంద్రీనీవా పనులు చేస్తున్నాడు. శుక్రవారం పనులు చేసే ప్రదేశంలో ఉన్న జనరేటర్ వద్ద సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టాడు. ఉన్నట్టుండి చార్జర్‌తో పాటు ఫోన్ పేలిపోవడంతో సురేష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కంది పంటకు నిప్పు

పెద్దమండ్యం : గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 10 ఎకరాలలో రైతులు సాగుచేసిన కందిపంట అగ్నికి ఆహుతైంది. శుక్రవారం మండలంలోని ముసలికుంటకు సమీపంలో తెల్లరాతివంక వద్ద ఈ ఘటన జరిగింది. రైతుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముసలికుంటకు చెందిన రైతులు సానక్కగారి శ్రీనివాసులురెడ్డి, జి చంద్రప్ప, సి. సుగుణమ్మ 10 ఎకరాలలో కందిపంటను సాగు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పంట మొత్తం కాలిపోయింది. పంటను రక్షించుకొనేందుకు రైతులు ములకలచెరువు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అయితే ఘటనా స్థలానికి ఫైర్ ఇంజిన్ వచ్చినా అప్పటికే పంట మంటల్లో కాలిపోయిందని రైతులు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటగా సాగుచేసిన కందిపంట చేతికి వచ్చే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 3 లక్షల నష్టం జరిగినట్లువారు తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వం తమకు పంట నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

చరిత్ర విస్మరించిన యోధుడు ఉయ్యాలవాడ

నేడు 178వ వర్ధంతి సభ





కోవెలకుంట్లలో ఉయ్యాలవాడ విగ్రహం, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పట్టుబడిన జగన్నాథకొండ

కడప సెవెన్‌రోడ్స్ : నేటికి సరిగ్గా 178 సంవత్సరాల క్రితం నాటి కడప జిల్లా తాలూకా కేంద్రమైన కోవెలకుంట్లలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని ఉరి తీసింది. కడప కలెక్టర్ జేహెచ్ కాక్రేన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో రెండు వేల పైబడి జనం చూస్తుండగా బహిరంగంగా ఈ దారుణానికి పాల్పడ్డారు. తమను ఎదిరించే ఎవరికైనా ఇదే గతి పడుతుందని ప్రజలను హెచ్చరిస్తూ 30 ఏళ్లపాటు ఆయన తలను అలాగే ఉంచారు. మూడు నెలలపాటు తమను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాపించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటును ఎట్టకేలకు అణిచి వేశామని బ్రిటీషర్లు సంబరాలు చేసుకున్నారు. కానీ పదేళ్ల తర్వాత అది ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా రూపుదాలుస్తుందని, సరిగ్గా వందేళ్లకు తాము ఈ దేశాన్నే వదిలిపెట్టి పారిపోవాల్సి వస్తుందని ఊహించలేకపోయారు.

చరిత్రకారుల చిన్నచూపు

నరసింహారెడ్డి తిరుగుబాటుకు సంబంధించిన బ్రిటీషు రికార్డులు ఎన్నో ఉన్నాయి. జానపదుల కోలాటపు పాటలు, పిచ్చిగుంట్ల వారు ఆలపించే పాటలు, ఇతర జానపద సారస్వతం తక్కువేమి లేదు. కానీ, ఆంధ్ర చరిత్రకారులకు ఇవి పట్టినట్టు లేదు. ఈ తిరుగుబాటు పట్ల చులకన ధోరణి ప్రదర్శించారు. పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం, చీరాల–పేరాల ఉద్యమం వంటివి చరిత్ర పుస్తకాలకెక్కాయి. కానీ నరసింహారెడ్డి సాగించిన వీరోచిత తిరుగుబాటు చరిత్రపుటల్లో చోటు చేసుకోకపోవడం బాధాకరం. ఇది రాయలసీమపై జరుగుతున్న వివక్షలో భాగమేనని ఇక్కడి మేధావులు అంటున్నారు. ప్రముఖ బెంగాలీ చరిత్రకారుడు ఎస్‌బీ చౌదురి 1955లో రాసిన 'సివిల్ డిస్టర్బెన్సెస్ డ్యూరింగ్ ద బ్రిటీష్ రూల్ ఇన్ ఇండియా' (1765–1857 అనే గ్రంథంలో నరసింహారెడ్డి తిరుగుబాటుకు ఒక సముచిత స్థానం కల్పించడం విశేషం. ఆ తర్వాత కాలాల్లో ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు పరిశోధన చేసి రూపొందించిన రేనాటి సూర్యచంద్రులు గ్రంథం, ప్రముఖ చరిత్రకారుడు బండి గోపాల్‌రెడ్డి రాసిన 'బ్రౌన్ జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు–కడప జాబుల సంకలనం', కల్వటాల జయరామారావు రాసిన రేనాటి వీరుడు, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పాణ్యం నరసరామయ్య రాసిన స్వాతంత్ర్య వీరుడు అనే పద్య కావ్యం వంటివి లేకపోతే నరసింహారెడ్డి తిరుగుబాటుకు సంబంధించిన వివరాలు చరిత్ర కాలగర్భంలో కలిసిపోయి ఉండేవి. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'సైరా నరసింహారెడ్డి' చిత్రం రాకపోయి ఉంటే రాయలసీమ జిల్లాల్లో కూడా నేటి తరానికి ఆయన పేరు తెలిసేది కాదు.

తొలి స్వాతంత్ర్య యోధుడు

ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు కాదని కొందరు వితండవాదన చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. తమ సంస్థానాన్ని లాక్కున్న బ్రిటీషర్లకు వ్యతిరేకంగా సమరం చేసిన ఝాన్సీలక్ష్మీబాయి స్వాతంత్ర్య సమరయోధురాలైనపుడు, సిపాయిల పితూరి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామమైనపుడు అంతకు పదేళ్ల ముందే గొప్ప తిరుగుబాటు చేసి ఉరికొయ్యను ముద్దాడిన ఉయ్యాలవాడ ఎందుకు స్వాతంత్ర్య సమరయోధుడు కాకుండా పోయారని ఈ ప్రాంత వాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి తిరుగుబాటు వెనుక ఆర్థిక, రాజకీయ కారణాలు ఉంటాయి. భారతీయుల ఉమ్మడి శత్రువైన బ్రిటీషర్లకు వ్యతిరేకంగా ఎవరు పోరాడినా దాన్ని స్వాతంత్రోద్యమ ప్రవంతిలో విడదీయరాని భాగంగానే చూడాలి.

'సీమ' రైతాంగ తిరుగుబాటు

నరసింహారెడ్డి పెన్షన్ కోసం చేసిన తిరుగుబాటు అని కొందరు అర్థరహితమైన వాదనలు చేస్తున్నారు. ఆయన పెన్షన్ కోసమే అయితే తొమ్మిది వేల మంది ప్రజలు ప్రాణాలు తెగించి తిరుగుబాటులో ఎందుకు పాల్గొన్నారనే ప్రశ్నకు మాత్రం సమాధానం ఉండదు. భూమి శిస్తు చెల్లించలేని రైతులు, ఇనాములు కోల్పోయిన కట్టుబడులు, ఇంకా అనేక కారణాల వల్ల దాదాపు అన్ని వర్గాల ప్రజలు ఈ తిరుగుబాటులో పాల్గొన్నట్లు నాటి ప్రభుత్వం నియమించిన స్పెషల్ కమిషనర్ డబ్ల్యుఏడీ ఇంగ్లీస్ 1847 జనవరి 19న జ్యుడిషియల్ డిపార్టుమెంటు సెక్రటరీకి సమర్పించిన నివేదికలో స్పష్టం చేయడం గమనార్హం. ఇది రాయలసీమ రైతులు జరిపిన తొలి తిరుగుబాటుగా చూడాలి.

ప్రభుత్వాల వివక్ష

ఎంతోమంది మహానుభావుల జయంతులను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నప్పటికీ నరసింహారెడ్డి జయంతి ఇంతవరకు నిర్వహించకపోవడం ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివక్షను ఎత్తిచూపుతోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉయ్యాలవాడ ప్రధాన అనుచరుల్లో ఒకరైన వడ్డే ఓబన్న జయంతిని జనవరి 11న రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించడం ఆహ్వానించదగింది. అయితే ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఉయ్యాలవాడను మాత్రం విస్మరించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉయ్యాలవాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని, పాఠ్యాంశాల్లో ఆయన చరిత్రను చేర్చాలని, ప్రభుత్వ పథకాలకు ఆయన పేరు పెట్టాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.

నేడు వర్ధంతి సభ

రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కడప ప్రెస్‌క్లబ్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభ నిర్వహిస్తున్నారు. కడప మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ అధ్యక్షతన జరగనున్న ఈ సభలో ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, నంద్యాలకు చెందిన ప్రముఖ జర్నలిస్టు కాశీపురం ప్రభాకర్‌రెడ్డి, ఉయ్యాలవాడ వంశీయులైన రూపనగుడి గ్రామానికి చెందిన కర్ణాటి ప్రభాకర్ రెడ్డి, ఇతర పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

అంగళ్లు బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- లారీ ఢీకొని టెంపో డ్రైవర్ దుర్మరణం
- కుమారుడు దూరమై తల్లిదండ్రుల వేదన





అంగళ్లు బైపాస్‌లో టెంపోను ఢీకొన్న లారీ (ఇన్‌సెట్) మృతుడు మనోహర్ (ఫైల్)

కురబలకోట : మండలంలోని అంగళ్లు బైపాస్ రోడ్డులో శుక్రవారం వేకువ జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సిమెంట్ లారీ ఢీ కొనడంతో టెంపో డ్రైవర్ మనోహర్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. అంగళ్లు బైపాస్ రోడ్డుపై తొలి మరణం కూడా ఇదే. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. ములకలచెరువు మండలం సోంపల్లె గ్రామం రాయపువారిపల్లెకు చెందిన కె. మనోహర్ (24) టెంపో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం వేకువ జామున టెంపోలో టమాటాలను మార్కెట్‌కు తీసుకెళ్లి అన్‌లోడింగ్ తర్వాత స్వగ్రామానికి బయలు దేరాడు. అంగళ్లు దగ్గర బైపాస్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన సిమెంట్ లారీ వేగంగా టెంపోను ఢీకొంది. టెంపో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవింగ్ సీట్లోనే మనోహర్ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఉత్తన్న అంధుడు. ఇతనికి కుమార్తె, కుమారుడు. జీవనాధారంగా ఉన్న కన్నపేగు మనోహర్ శాశ్వితంగా దూరమవడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన సిమెంట్ లారీ రాంగ్ సైడ్‌లో వచ్చింది. దొమ్మన్నబావి–గోల్డన్ వ్యాలీ మార్గంలో పెండింగ్ పనులు జరుగుతుండడంతో ఫోర్‌వేలో ఒక రోడ్డును క్లోజ్ చేశారు. విధి లేని పరిస్థితిలో లారీ పక్క రోడ్డులో రావడంతో ప్రమాదానికి కారణమైందని భావిస్తున్నారు. అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ సంఘటన జరిగి ఉండేది కాదని వ్యక్తమవుతోంది.

న్యాయవాదుల చట్టసవరణపై నిరసన



రాయచోటి కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటి అర్బన్ : న్యాయవాదుల చట్టసవరణ బిల్లు –25ను వ్యతిరేకిస్తూ రాయచోటి న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన ప్రదర్శన చేశారు. రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్యల నేతృత్వంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన న్యాయవాదుల చట్టసవరణ బిల్లు –25ను అమలులోకి వస్తే బార్‌కౌన్సిల్ స్వతంత్రప్రతిపత్తికి, న్యాయవాదుల వృత్తిపరమైన సమస్యలకు కారణమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఒకరకంగా కక్షిదారులు స్వేచ్ఛగా తన న్యాయవాదిని ఎన్నుకునే పరిస్థితిని కూడా కోల్పోతారంటూ చెప్పారు. న్యాయవాదులు కూడా ఇప్పటిలాగా ఏకేసునైనా డీల్ చేయడానికి ముందుకురాని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇలాంటి పరిస్థితులన్ని కూడా న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ఉంటాయన్నాయన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగముని, న్యాయవాదులు ఆనందకుమార్, చిన్నయ్య, టి.ఈశ్వర్, రెడ్డిబాషా, హుమయూన్, రవి శంకర్, నిరంజన్, వరలక్ష్మి, కృష్ణమ్మ, సయ్యద్‌బాషాతో పాటు న్యాయవాదుల గుమస్తాల సంఘం నేతలు రామక్రిష్ణ, సుబ్బరామయ్య, రమణ, వీరనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సినీఫక్కీలో బంగారు గొలుసు చోరీ



బాధితురాలు కృష్ణమ్మ

పీలేరురూరల్ : సినీ ఫక్కీలో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ సంఘటన శుక్రారం పట్టపగలు పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. దొడ్డిపల్లె పంచాయతీ పెద్దిరెడ్డిగారి పల్లెకు చెందిన కంభం కృష్ణమ్మ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లడానికి పీలేరుకు వచ్చింది. స్థానిక పాతబస్టాండ్ నుంచి కాలినడక వెళ్తుండగా సాయిబాబా గుడి వీధిలో ఓ దుండగుడు ఆమెతో మాట్లాడుతూ 'అక్కడ పోలీసులు ఉన్నారు.. బంగారు చైను వేసుకున్నవారికి జరిమానా వేస్తున్నారు' అంటూ నమ్మబలికాడు. దీంతో ఆమె తన మెడలోని సుమారు 55 గ్రాములు బరువుగల బొట్టుగొలుసు, కాసులు తీసి బ్యాగులో పెట్టుకోబోయింది. అంతలోనే అతను ఓ పేపరు ఇచ్చి ఇందులో భద్రపరచుకో అంటూ సూచించాడు. ఆమె పేపరులో బంగారు నగలు వేయగానే తన చేతో వేరే పేపరు పెట్టి అక్కడి నుంచి జారుకున్నాడు. కొంతదూరం వెళ్లిన తరువాత పేపరు అందులో ఇనుప కమ్మీలు ఉన్నట్లు గ్రహించి మోసపోయానని బంధువులకు సమాచారం ఇచ్చింది. జరిగిన సంఘటనపై ఎస్‌ఐ లోకేష్‌కు ఫిర్యాదు చేశారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు

రాయచోటి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ గ్రామపంచాయతీ కార్మి కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ కార్మికులకు 3 నుంచి 6 నెలల వరకు ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌లు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాని కోరారు. హైకోర్టు తీర్పు ప్రకారం ఉమ్మడిజిల్లాల ప్రాతిపదికన రెగ్యులర్ జాబితా ప్రతి పాదనల నివేదికను జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి సకాలంలో పంపాలన్నారు. సంఘం గౌరవ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎ.రామాంజులు, సురేంద్రబాబులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధు లను కొన్ని పంచాయతీల గ్రీన్‌అంబాసిడర్‌లకు పూర్తిచెల్లించకపోవడం దారుణమన్నారు. అనంతరం డీఆర్‌ఓ, డీపీఓలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లానేతలు హరి, ఓబులేశు, కాంతమ్మ, పార్వతమ్మ, రెడ్డెయ్యతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

టమాటా రైతులు ఆందోళన చెందకండి

రాయచోటి టౌన్ : టమాటా రైతులు ఆందోళన చెందవద్దు.. గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొంటోదని రాష్ట్ర రవాణ, క్రీడలు, యువజన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4303 హెక్టార్లలో టమాటా సాగు చేసినట్లుగా అధికారిక లెక్కలు ఉన్నాయన్నారు. వాటి ద్వారా పండించిన పంటలో మదనపల్లె మార్కెట్ యార్డు నుంచి 12 మెట్రిక్ టన్నులు, ములకలచెరువు మార్కెట్ నుంచి 705 మెట్రిక్ టన్నులు మద్దతు ధరకు కొనుగోలు చేసి వాటిని 22వ తేదీ శనివారం గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, ఒంగోలు మార్కెట్‌లకు తరలిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రూ.10 నుంచి రూ.15ల వరకు మద్దతు ధర లభించే అవకాశం ఉంటుందన్నారు.

సీటీఎం రైల్వే స్టేషన్లో ఇరిగేషన్ ఉద్యోగిపై దాడి



గాయపడిన ఇరిగేషన్ ఉద్యోగి వెంకటకృష్ణారెడ్డి

మదనపల్లె : సీటీఎం రైల్వేస్టేషన్లో ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. అనంతపురం జిల్లా ధర్మవరంకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు వెంకట కృష్ణారెడ్డి (52) స్థానికంగా ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఇరిగేషన్ శాఖలో పనులు నిమిత్తం మదనపల్లెకు వచ్చాడు. పనులు ముగించుకుని శుక్రవారం తిరుపతి వెళ్ళేందుకు సీటీఎం రైల్వే స్టేషన్‌కి వెళ్ళాడు. అక్కడ బాత్రూం వద్ద మరో ఇద్దరు వ్యక్తులతో వివాదం చెలరేగి, గొడవకు దారితీసింది. గుర్తుతెలియని వ్యక్తులు వెంకటకృష్ణారెడ్డిపై దాడి చేయగా తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధితుని వద్ద నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అతని ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై..

మదనపల్లె : భూ వివాదం కారణంగా మహిళపై దాడి చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం–2 పంచాయతీ రేగంటివారిపల్లెకు చెందిన, శంకర్ భార్య రుక్మిణమ్మ (48) కుటుంబానికి, అదే గ్రామంలోని బంధువైన ధర్మరాజు తో భూ వివాదం ఉంది. ఈ క్రమంలో భూమి సర్వే నిర్వహించి అక్కడ ధర్మరాజు స్తంభాలు నాటుకుంటుండగా, సమస్య పరిష్కారం కాకుండా దారికి అడ్డుగా స్తంభాలు ఎలా నాటుతారంటూ రుక్మిణమ్మ ప్రశ్నించింది. దీంతో ధర్మరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఆమెపై దాడి చేసి కొట్టారు. గమనించిన స్థానికులు బాధితురాలని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం అప్పినపల్లికి చెందిన మునిరత్నం కుమారుడు సుధాకర్ (39), రాయచోటికి చెందిన తన స్నేహితుడు రమణ (40)తో కలిసి రాయచోటిలో జరగనున్న శుభకార్యానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలోని కురబలకోట మండలం ముదివేడు సమీపంలోని తానా మిట్ట వద్ద వెనక నుంచి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో సుధాకర్ రమణ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



లక్ష్మి (ఫైల్)

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని సింగయ్యగారిపల్లి లక్ష్మి అనే మహిళ అప్పుల బాధతో కలత చెంది గురువారం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓబులవారిపల్లి మండల కేంద్రంలో టిఫిన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న లక్ష్మి గత కొన్ని రోజులుగా అప్పులు అధికం కావడంతో వారి ఒత్తిడికి తట్టుకోలేక మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు అన్నిచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళ ఆచూకీ తెలిస్తే 7995467742 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ మహేష్ నాయుడు కోరారు.

అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య

– నిందితులపై కేసు నమోదు

మదనపల్లె : మండలంలోని పోతబోలు పంచాయితీ, సిద్ధం గారి పల్లెకు చెందిన కృష్ణప్ప, హసీనాబీ దంపతుల రెండో కుమారుడు గిరి (42) వేధింపులతోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆ మేరకు కేసును మార్పు చేసి నిందితులపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..మృతుడి కుటుంబ సభ్యులు గిరి ఆత్మహత్యపై ఫిర్యాదు చేశారన్నారు. గురువారం హసీనాబీ ఆమె కుమారుడు గిరి, అదే గ్రామానికి చెందిన అనిల్, మరికొందరిని కలిసి తాము ఇంటిని నిర్మించుకోవాలనుకుంటున్నాం, దారి ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ విషయమై అనిల్ మరో ఐదుగురితో కలిసి రాత్రి గిరి పై దాడి చేశారు. స్థానికంగా ఉన్న కరెంటు స్తంభానికి గిరిని కట్టివేసి విచక్షణ రహితంగా కొట్టారు. దీన్ని అవమానంగా భావించిన గిరి అక్కడి నుంచి ఇంటికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనపై దాడి చేసిన వారి వివరాలతో కూడిన సూసైడ్ నోట్ జేబులో ఉంచుకున్నాడు. సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు, శుక్రవారం అనిల్ తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చేనేత కార్మికులపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే దౌర్జన్యం

- పాతికేళ్ల క్రితం కొనుగోలుచేసిన ఇళ్లస్థలాల ఆక్రమణకు యత్నం
- బాధితులందరూ టీడీపీ సానుభూతిపరులు
- మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



పాతికేళ్ల కిత్రం కొనుగోలుచేసిన ఇంటిస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతూ నిరసన తెలుపుతున్న చేనేత కార్మికులు

మదనపల్లె : కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకీ శృతిమించిపోతున్నాయి. అధికారంలో ఉన్నామని చెప్పి, బడుగు, బలహీనవర్గాలకు చెందిన భూములు, ఇంటి స్థలాలను దౌర్జన్యంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా...అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం సిరికల్చర్ కాలనీలో చేనేత కార్మికులు పాతికేళ్ల క్రితం తమ కష్టార్జితంతో కొనుగోలుచేసిన ఇళ్ల స్థలాలను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు దౌర్జన్యం చేయడంతో దిక్కుతోచని స్థితిలో బాధితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమకు ఏదైనా కష్టం వస్తే చెప్పుకునేందుకు వెళ్లే నాయకుడే, తమ కష్టానికి కారకుడైతే, తమకు న్యాయం చేసేది ఎవరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ దౌర్జన్యంపై బాధితులు మీడియాతో మాట్లాడుతూ...మదనపల్లె పట్టణం బండమీదకమ్మపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్.423–1, 423–2లలో 2004లో కొండుపల్లె యశోదమ్మ, కొండుపల్లె శ్రీనివాసులు, కొండుపల్లె రెడ్డెప్పలు తమకు సంక్రమించిన భూమిలో లేఔట్ వేసి 77 ప్లాట్లుగా పలువురికి విక్రయించారన్నారు. వీటిని కొనుగోలు చేసిన వారిలో కొంతమంది ఇళ్లు నిర్మించుకోగా, మరికొందరు పునాదుల వరకు, మరికొందరు కంచె వేసుకుని తమ స్థలాలను భద్రపరచుకున్నామన్నారు. తమ స్థలాలను బ్యాంకులో తాకట్టు పెట్టి లోను తీసుకుని ఇళ్లు నిర్మించుకున్న వారు ఉన్నామన్నారు. కొంతమంది ఇతరులకు విక్రయించడం చేశారన్నారు. పాతికేళ్లుగా ఇళ్ల స్థలాలు తమ ఆధీనంలో ఉన్నాయన్నారు. రెండురోజుల క్రితం టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్... తాను ఈ భూమిని కె.వెంకటరమణ కుమారుడు కే.వెంకటేష్‌బాబు నుంచి 2020లో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీఏ) పొందిన హరినాథరెడ్డి దేశిరెడ్డి నుంచి జనవరి 2025లో కొనుగోలు చేశానని, స్థలం తనదేనని బెదిరించారన్నారు. దీంతో తామంతా..ఈ స్థలం పాతికేళ్ల క్రితమే తాము కొనుగోలు చేశామని, దానికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు, ఈసీ, ఇతర పత్రాలన్నింటినీ ఆయనకు చూపితే, మాట్లాడుకుందాం రమ్మని పిలిచారన్నారు. తర్వాత ఆయన వద్దకు వెళితే... మొదట కొండుపల్లె శ్రీనివాసులు నుంచి కొనుగోలు చేసిన భూములు వదిలేస్తామని, మిగిలిన వారు ఇళ్లస్థలాలు వదులుకోవాల్సిందే అని చెప్పారన్నారు. తాము అతడి వద్దే కొనుగోలు చేసినట్లు పత్రాలు చూపితే, కొంత సేపటికి మాటమార్చి కే.వెంకటేష్‌బాబు దగ్గర కొనుగోలుచేసి ఉంటే వదిలేస్తామని బెదిరించారన్నారు. దీనికి తామంతా టీడీపీకి చెందిన వారమేనని, చేనేత కార్మికులమైన మమ్మల్ని మీరు ఇబ్బంది పెట్టడం తగదని వేడుకుంటున్నా, జేసీబీలు, మనుష్యులతో తాము కట్టుకున్న ఇళ్లు, పునాదులు చుట్టూ కంచె వేసి వెళ్లిపోవాల్సిందిగా హుకుం జారీచేశారన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, తాజాగా తాను కొనుగోలు చేశానని చెప్పుకుంటున్న డాక్యుమెంట్‌లో సర్వేనెం.423–2లోని 1.85 ఎకరాలు అగ్రికల్చర్ ల్యాండ్ ఫిట్ ఫర్ హౌస్ సైట్స్ కింద రిజిస్ట్రేషన్‌కు దాఖలు చేశానని, ఈ స్థలంలో ఎలాంటి ఇండ్ల జాగాలు, ప్లాట్లు లేవని సెల్ఫ్ డిక్లరేషన్ రాసి ఇచ్చి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన దొమ్మలపాటిరమేష్, పేదలకు న్యాయం చేయాల్సింది పోయి వారి కష్టార్జితాన్ని దోచుకునేలా ప్రవర్తించడం ఏమాత్రం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన వారిలో వెంకటయ్య, ఆర్.శంకర్, చంద్రశేఖర్, రమణ, స్వాతి, సుబ్రహ్మణ్యం, నళిని, మాలిన్, మంజుల తదితరులు ఉన్నారు.

ఇరు వర్గాల ఘర్షణపై కేసు

మదనపల్లె : ఇరువర్గాలు కర్రలతో దాడి చేసుకున్న ఘటనపై కేసులు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గురువారం రాత్రి పుంగనూరు రోడ్డులోని కృష్ణాపురం వద్ద ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో, వాహనానికి పెట్రోల్ నింపుకునే విషయమై ఇరువురి మధ్య జరిగిన గొడవ, ఇరు గ్రామాలకు పాకి, రెండు గ్రామాల వ్యక్తులు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న విషయం తెలిసిందే. మండలంలోని వలసపల్లె పంచాయతీ అరవ వాండ్ల పల్లెకు చెందిన పూల గణేష్, కృష్ణాపురంకు చెందిన హరిల మధ్య గురువారం రాత్రి గొడవ జరిగింది. ఘర్షణలో హరి, గణేష్ ను కొట్టడంతో, అరవ వాండ్ల పల్లి నుంచి పెద్ద ఎత్తున గణేష్ మద్దతుదారులు కృష్ణాపురం వద్దకు చేరుకున్నారు. దీంతో హరి మద్దతుదారులు సైతం అక్కడికి పెద్ద సంఖ్యలో వచ్చి ఇరువర్గాలు కర్రలతో దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ కళా వెంకటరమణ సిబ్బందితో అక్కడికి వెళ్లి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనపై శుక్రవారం అరవ వాండ్ల పల్లె గణేష్ ఫిర్యాదు మేరకు కృష్ణాపురం కు చెందిన 11 మందిపై, హరి ఫిర్యాదు మేరకు అరవ వాండ్ల పల్లి కు చెందిన 13 మందిపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.